రేణ

అందీ అందని తిండితో శుష్కించిన దేహాన్ని అతినీరసంగా ఆరుబయట నుంచి లేపింది లక్ష్మి,అన్యమనస్కంగా రెండు కాళ్ళ మధ్య తల ఆన్చి, తనలో తానేదో గొణుక్కుంది. హృదయంలో ఎక్కడో తేమ ఆరిపోయినట్టు తెమలని స్వరంతో తేరుకోని మనసుతో-

“లే! లెవ్వు బిడ్డా! తెల్లారి పాయె పొయ్యిల కొక్క కట్టెపుల్ల గూడలేదు. జెల్ది సాన్పేసి యాల్లకమన కట్టెలకు పోదాం లెవ్వు” అంది.

“ఊఁ! అని మూల్గి, అటు పక్కకు బొర్లింది రేణ.

“జెర లెవ్వుబిడ్డా! నీ దండం బెద్త బాంచెన్....! అగొ ఎండ జూడు ఎట్లత్తుందో కొఱ్ఱాయొలె...!” అంటూ మళ్ళీ లేపింది లక్ష్మి.

“ఊఁ! నీయవ్వనీ...” అంటూ బద్ధకంగా లేచి కళ్ళు నులుముకుంది రేణ.

ఎండ చుర చుర పాక్కుంటూ ఊరవతలి గుట్టల మధ్యలోంచి లేస్తూ, మసుకును తెర మరుగుచేస్తూ, శ్రమజీవుల బ్రతుకును గుర్తుచేస్తుంది.

ఇంటిముందటి బజాట్లోని పేడని తట్టలో తీసుకొచ్చింది లక్ష్మి.

పక్క బట్టలు మడిచి, ఇంట్లోవేసి చీపురందుకొని బర బర ఇల్లూవాకిలి రేణ ఊడ్చుకొచ్చేలోగా, బకెట్లొ సాన్పు కలిపింది లక్ష్మి. రేణ పాచిగిన్నెలు తోమింది. లక్ష్మి సాన్పు చల్లింది. రేణ ముగ్గులు వేసింది. లక్ష్మి రెండు గ్లాసుల బియ్యాన్ని అత్తెసరు పెట్టి పొయ్యి రాజేసింది.

“గా నర్సక్క అత్తదేమో...అడిగత్త, జెరపొయ్యి దిక్కు జూడు బిడ్డా!” అనుకుంటూ బొగ్గుతో పళ్ళు తోముకుంటూ బయటకు బయల్దేరింది లక్ష్మి.

అన్నం వార్చింది పళ్ళు తోముకొని ముఖం కడుక్కొంది. అద్దం ముందు కూకొని, తల దువ్వుకుంటుంది రేణ.

“కానీయ్! జెల్ది జెల్ది గానీ...ఎండ రావట్టె...నర్సక్క రాదట...” అనుకుంటూ రప్పరప్ప ఇంట్లో కొచ్చింది లక్ష్మి.

“ఎవ్వలు రాకపోతేందే భయమా మనకు?” అంది రేణ.

Scanned by CamScanner

"తలెలల్ల కూడు వెట్టి ఇంత మిరమెయ్యి బిడ్డా...సల్లార్తది" అంటూ ముఖం కడుక్కొని తుడుచుకొంది. చీరసింగులు సర్దుకుంటూ, వెనక్కీ ముందుకీ చూసుకుంది లక్ష్మి.

కాస్త చల్లారింతర్వాత ఇద్దరూ గబగబా తిని, రెండు కొడవళ్ళు నూరుకొని, చుట్టబట్టల్తో బయల్దేరిండ్రు.

ఎండ వేడెక్కుతూ మరింత ముదురుగా రంగు మార్చుకుంది. ఊరిపక్క 'లూటిపోయిన' తోటల కేయి ములుపుచ్చ చెట్ల మధ్య కాలి బాటల్ల కేయి, ఆకలితోటి యుద్ధానికి నడిచినట్టు, బతుకుని గెల్చుకునేతందుకు అడవికేసి నాలుగు పాదాలు నడుస్తున్నయి.

పిల్లబాట నుంచి బండ్లబాట మీదికి చేరుకున్నరు. లక్ష్మి మెదల్లో ఏవో ఆలోచన్ల గింగిర్లు కొడ్తున్నయి. బాటపక్క మఱ్ఱిచెట్టు చుట్టూతా జిబ్బుగా నిండుకున్న విషకంట్లపు చెట్ల పొదల్లోకి ముంగిస పరుగెడ్తోంది. మఱ్ఱిచెట్టు ఊడల్నందుకొని ఉడుతలు సయ్యాటలాడుకుంటున్నయి. చెట్టుకింద కాలిపోయి మసిబారిన రాళ్ళు, చీకి పారేసిన ఎముకలూ, గిన్నెలాంటి తాబేలు బుఱ్ఱా..సంచార జాతుల సంకేతాలై మెరుస్తున్నయి.

తంగెడు చెట్లు, వాయిలు గుంపులూ, మంగపొదలూ, ఈత చెట్లకు అల్లుకున్న నల్లెడతీగలూ, అడవిదొండ తీగలూ పరస్పర ప్రాకృతిక సాంగత్యాన్ని తెలుపుకుంటున్నయి. లేతలేత ఆకుల్తో కానుగచెట్టు చల్లటి గాలిని వీస్తుంది. దాని పక్క మామిడి చెట్టునిండా కొమ్మ కొమ్మకు కొర్లు తిరుగుతున్నయి. చింత చెట్టుకు పొలసుల్లాటి తోడుకల్ని టకటకా పొడుచుకుంటూ, వడ్ల పిట్ట చిన్న చిన్న పురుగుల్ని ఏరుకొని తింటుంది.

వెంకయ్య గౌడ్ తాడిచెట్టు ఎక్కి దిగుతున్నడు. ఇద్దరు పిల్లలు ఈత గెలల్ని దులుపుతూ, రాలిన ఈతపండ్లను తమ నిక్కరు జేబుల్లో నింపుకుంటూ, మురుస్తూ గంతులేస్తున్నరు.

"దా బిడ్డా! దబదబ వోదాం! ఇగ జెఱ్ఱాగితే...సుఱ్ఱ సుఱ్ఱ గాల్తయి కాళ్ళు" వెనుకొస్తున్న రేణని ఉత్సాహపర్చింది లక్ష్మి.

నెమలి నార చెట్టు మీద కోయిల 'కూ' అంది. 'రేణ'-'కూ' అంది. కోయిలా రెచ్చిపోయి, రెట్టించి 'కూ' అంది. రేణ మరింత గట్టిగా 'కూ' అంది. చెట్టుమీంచి కిందికి చూసి, మానుకొంది కోయిల-రేణ మళ్ళీ 'కూ' అన్నా పట్టించుకోలేదు కోయిల.

Scanned by CamScanner

లక్ష్మి కిలకిలా నవ్వింది.

చెరువు కట్ట మీంచి బెస్త నర్సయ్య తన చేపల బుట్టతో ఎదురొస్తూ "యాడికి శెల్లే!?" అన్నడు.

"పొయ్యిల కొక్క కట్టెపుల్ల లేదన్నా!" అంది లక్ష్మి.

"సల్లపూట దబదబ వోంద్రి! ఇగ జెర్రాగితే దగడు దగడోలె అత్తది ఎండ...ఆటంగా రొండు మోపులు కట్టుకచ్చుకుంటే కొన్ని ఇంట్లకయితయి, మిగిలితే చిన్నగా పల్సగా రొండు మోపులు జేస్కొని,'ఎల్లడపాట్ల' '(ఎల్లారెడ్డిపేట) అమ్ముకుంటే, అంగడి నాడు సామాన్లు కొనుక్కోవచ్చు" ప్రేమగా సలహా ఇస్తూ అన్నడు నర్సయ్య.

"సేత్తామంటే పనిలేదు, సేతులొక్కపైస లేదు... గదే జూత్తున్నమన్నా!" అనుకుంటూ చెరువు కట్టదిగి, ఒర్రెలోంచి ఒక చిన్న గుట్టలాటి ఎత్తుపైకి చేరింద్రు. నర్రంగె, పాల కొడిసె,మద్ది, మోదుగ చెట్లు విస్తరించి ఉన్నయి. టేకు చెట్లూ చక్కటి ఎండిన పబ్బులూ, కొన్నైతే పేర్లే తెలియని చెట్లు.

వెనక్కి చూసింది లక్ష్మి. ఎక్కడో దూరాన కనబడ్తుంది ఊరు.

"రేణా! ఈన్నె...గీ పబ్బుల్నే సెలుక్కుందాం బిడ్డా! ఇగ దూరంబోతే...మళ్ళీ అచ్చేటప్పుడు శాతగాదు." అంది లక్ష్మి.

గోసులు వోసుకుంద్రు.

కొట్టిన కట్టెలను కొట్టినట్టు...ఒక నీడకు తీసుకచ్చింద్రు. అలసట వస్తుంది. చెమట కార్తుంది. దూపవుతుంది. ఒళ్ళంతా ఉప్పు పేరుకుపోయి, ఏదో అసహనంగా చికాకుగా చిటపటగా మంటగా ఉంది.

దగ్గర్లో ఈతపిల్లల పొదలో ఉన్న ఖాళీ లొట్టి చూసింది లక్ష్మి. లొట్టిలోని మట్టిని తుడిచింది.

"గీ రాజిరెడ్డి బాయికాడ నీళ్ళు దెస్తా కూసో బిడ్డా!" అంది లక్ష్మి.

"ఏ...నేనే దెత్తతియ్యే!....నువ్వే గూసో!" అంది రేణ.

" ఏ అద్దు బిడ్డా! పడుసుల వద్దులోల్లు పట్టపగటీలి పాడువడ్డ బాయికాడికి పోవద్దు!" అనుకుంటూ తానే బయలు దేరింది లక్ష్మి.

Scanned by CamScanner

మెట్ల ద్వారా సగం వరకు దిగింది. సొలిగినట్టయ్యింది. నిమాయించుకుంది. గుబులు జడుపులా ఆవహించింది. దరి అంచున నిలబడి కాళ్ళు చేతులు కడుక్కొంది. దోసిళ్ళతో దామార తాగింది. లొట్టిలో నీళ్ళు పోసి కడిగి లొట్టి ముంచింది. కడుపు నిండినట్టయ్యింది. అలసట తీరినట్టయి...'బ్రేవు' మనుకుంటూ ఎట్లానో వగరుస్తూ మెట్లు ఎక్కింది.

చెట్టు కింద రేణకు లొట్టి వంచి నీళ్ళు తాగించింది లక్ష్మి. లొట్టిని పక్కన పెట్టి...కాసేపు సేద తీర్చుకున్నరు. మరిన్ని నీళ్ళు తాగి...ఈతనళ్ళు కోసి మోపులు పేర్చింర్రు. నళ్ల తోటి మోపుల్ని కట్టుకుంర్రు. మిట్ట మధ్యాహ్నమయింది. వేడివేడిగా గాలి వీస్తుంది. ఎండ ధగధగ మెరుస్తుంది.

చెట్టు నీడన 'చుట్టబట్ట' తువ్వాలను పరచుకొని రేణ మేను వాల్చి విశ్రమించింది.

లక్ష్మి...తానంత ఏదో...తమ మనసు గతంలోకి లాక్కెళ్తుంది. వద్దని వారించుకున్నా వదలని జ్ఞాపకాలు...భర్త సాహచర్య తీపి గుర్తులు. అచంచల విశ్వాసం. తనకేమీ అంతుబట్టని అమాయకత తనకోమారు ఉత్సాహాన్నిస్తుంది. తను కోల్పోయినదేదో దొరక్క తన భర్తలాంటి రంగాన్నే ఎంచుకొని తనకు అస్పష్టంగానైనా తోచే.... అదే దారిలో...సుగమం చేసుకొని బతుకును సాఫల్యం చేస్కుంటే తన హృది నిమ్మళించునేమో...

ఎంత మంచి మాట తన భర్తది.

నాగలి చేతబట్టి దున్నుతూ ఉంటే...ఆకలి దప్పులనకుండా ఎన్కకు చూడకుండా చరచరా వెళ్ళేవాడు. ఎవరినీ నొప్పించకుండా...తొట్రుపాటు లేకుండా మాట్లాడేటోడు. ఎదుటివాళ్ళతో..ఎంత విసుగనిపించినా చిరునవ్వు నవ్వే వాడే కాని...విసుగే మాత్రం కన్పించనీయకపోయేవాడు. ఎంత తెల్సిన వారితోనైనా వాదనకు దిగేవాడు. వీలువెంట పుస్తకాలు చూస్తుండేవాడు. తనకెంతో ఓపిగ్గా చదివికూడా విన్పించేవాడు. ఉల్లాస పెట్టేవిధంగా మంచి మంచి పాటలు పాడేటోడు. ఊరి వతాందార్లకు తలొగ్గకుండా బెట్టుకు దిగేటోడు.

"చూడు లచ్మీ! నీ మొగడు గిట్లేందే!" అంటూ దొరలు బెదిరించినట్టొక మారు, దేబిరించినట్టు ఒకమారు బెదిరించి చొరవ తీసుకొని చనువుగా తనని ప్రలోభ పెడ్తున్నట్టు ఒకమారు మాట్లాడ్తుండేవాళ్ళు. తోటి ఆడవాళ్ళు సైతం "మీ ఈరయ్య ఎంత మంచోడే!" అనుకుంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచేవారు. అప్పుడు రేణ పసిగుడ్డు. వీరయ్య అవ్వ ఎంతో కష్టపడి చదివించింది. రెండెకరాల పొలం ఇల్లూ సంపాదించింది.

Scanned by CamScanner

వీరయ్యను ఎంతో గారాబంగా పెంచింది. కానీ...ఉద్యోగం దొర్కలేదు, ఇల్లూ మిగిలింది,దున్నటానికి పొలమూ మిగిలింది. అర్థం చేస్కునే లక్ష్మీ దొర్కింది. అందుకు గుర్తుగా తన తల్లి పేరే 'రేణవ్వ' తన బిడ్డకు పెట్టుకున్నడు.

లక్ష్మికి మతి పోతోంది.

"వీరయ్య! ఇప్పుడు నీ బిడ్డను సూడు! ఎంతయ్యిందో, అచ్చం నీలెక్కనే పొద్దది, మాట్లాడ్తది, నీ గుణాలన్నీ అచ్చినయ్, నువ్విడిసిన సోపతులే తాను చేస్తుంది. పనికి బెదరది, మరి దేనికీ బెదరది. మొత్తం నీ లెక్కనే ఎప్పుడూ ఏదో పని సోదిచ్చుకుంటది."

"మళ్ళా ఎప్పుడన్నా పుడ్తవా వీరయ్యా!?"గొంతు వణుకుతుండంగా తనలో తాను గొనుక్కుంది.

"మళ్ళా నీ భార్యగానే పుట్టాలనుంది. ఇప్పటి లెక్కగాదు. కష్టం నష్టం నీతోటే ఉండి.నువు జేసిన పని నేను గూడ జేయాలనుంది. నాకు గర్వంగా ఉంది వీరయ్యా! ఏందెల్వని నాకు ఎంతవద్దన్నా నాల్గచ్చిరాలు నేర్పిత్తివి. నాకర్థం గాకున్నా, యాష్టపడకుంటా...నాకెన్ని ముచ్చట్లు చెప్పినవ్....నీకెవలు నేర్పింద్రు ఇవన్నీ...ఇప్పుడు మన రేణవ్వ గూడా నాకు దెల్వనియి ఎన్నో నేర్చుకుంది."

"ఒగనాడు ఇదే చెట్టుకింద ఎంత సేపు కూకుండి మాట్లాడుకున్నమ్" కళ్ళ నీళ్ళు తుడుచుకుంది.

"ప్రపంచంల పని జేసేటోళ్ళమంతా ఒకటి. పని జెయ్యక మెక్కి తినే వాళ్ళంతా ఒకటి, మెక్కి తినేవాళ్ళ మక్కెలిరగ్గొట్టి మన రాజ్జెం, కష్టజీవుల రాజ్జెం రావాలంటివి. ఇగో...వీరయ్యా....వేమింకా కష్టంలనే ఉన్నం....అయ్యా! నీ తెలివి మాకియ్యవా...పదిమంది కోసం పాణమిచ్చిన నీతోవ జూపెట్టవా? నీ తొవ్వలెంకు తున్నమ్. మాకు దొర్కుతదా?

మన రాజ్జెం ఎప్పుడత్తదో...అయ్యా...నువ్వు జెప్పినట్టిది రొండు వర్గాల నడుమ ఎడతెగని కొట్లాట. ఇది బాధ, ఇది ఆకలి,దేనిగ్గూడా ఎనుకాడని సావుసం, ఎంతో తెల్వి ఉంటే తప్ప తెల్వని లోక బాధ."

లక్ష్మి మనసు పరిపరి విధాల పరితపిస్తుంది. జ్ఞాపకాల్లో వేలాడుతుంది. రేణ పెరుగుతున్నా కొద్దీ ఆమెతో అనుభవం వల్ల భాషాభివృద్ధి, ఆమెతో రోజూ మాట్లాడుకునే వారి స్నేహితుల వాదనవల్ల లక్ష్మికి ఆలోచన్లు పెరుగుతున్నయ్. తనకు జీవితం నిరంతర తపనగా తోస్తుంది. గోచి వెట్టుకొని కొంగు నడుముకు చుట్టి...పొయ్యి

Scanned by CamScanner

రాజేసే కర్రల్ని నరుక్కున్నట్టే...అన్నిటికీ సిద్ధమయ్యే ఉంది. పరిపక్వమయ్యే ఉంది. రాజేసిన పొయ్యి మీద కుతకుతా ఉడికినట్టు...ఆకలికి అన్నం అందినట్టు తనకేదో భావం అందినట్టే అంది ఒక ఊపిరిలాంటి దీపం వెలుగుతుంది. ఆలోచన్లు ఉద్దీప్తమవుతున్నయి. చావుకీ బతుక్కీ తేడాలేని బతుకుని చీదరించుకుంటున్నయి. రేణ కూడా తన బిడ్డే, వీరయ్య బిడ్డే కదా! పోరు వీరయ్య బిడ్డే కదా! చదివిన ఏడో తరగతి చదువుతోనే ఎన్నెన్ని చేస్తుంది. అయ్యా! వీరయ్యా! నీ బిడ్డ నీ వెనుకాలే నీ వీర సాహస వారసత్వాన్ని నిలుపుకునేటట్టుంది.

సందర్భమో...అసందర్భమో...మొలచుకొచ్చే జ్ఞాపకాలు...ఒక స్పష్టమైన దారి, సమస్త దరిద్రులు నడువాల్సిన దారి, దోపిడీ ధనికులు కూలే దారి...దుఃఖం, బాధ, వేదన, కోరిక, పోరాటం, ఆశ, ఆలోచన,మథనం, వ్యూహం, చేవ, సాహసం, దిన దినమూ పెరుగుతూనే ఉన్న బూటకపు ఎన్‌కౌంటర్లు.

వచ్చిన చదువు చాలింది లక్ష్మికి.

తాను నేర్చుకున్న అక్షరాలు అవసరపడ్తున్నయి. తానంటే ఏమిటో అంతు బట్టడానికి, తనకున్న జీవనశక్తి ఎంతో తేలటానికి.

వడగాలి వీస్తోంది. రేణ అలసట తీరలేదు. ఎండ పొడ తీవ్రమయ్యింది. జ్ఞాపకాలు పెనుభారమై గతమంతా స్మృతి పలకంపై రూపుదిద్దుకుంటున్నయి.

* * * * * * *

పదిహేను రోజులుగా వీరయ్య దున్నీ దున్నీ కాళ్ళూ కీళ్ళూ ఒళ్ళంతా నొప్పి...ఇంటికి వచ్చిరాంగనే ఆరుబయట చాపేసుకుని అచేతనగా నిద్రపోయిండు.

ఒక్కోసారి అంత అసహాయ స్థితిలో సైతం నీళ్ళు తేవటమో, కూరగాయలు కోయటమో 'మనసారా' పనిజేస్తూ లక్ష్మిని ఆనందింపజేసేవాడు.

అరచేతులు నేలపై అన్చి మెల్లిగా లేచిండు.

"లక్ష్మీ! కాలు నడువత్తలేదే! ఆందుల సీకుటం బట్టినట్టుంది ముల్లు. ఇరిగిందో, కుచ్చిందో, కాలంతా తడతడ అంటుందే!" అన్నడు వీరయ్య.

పొయ్యి మీద బియ్యమేసి వచ్చి, తన మోకాలి మీద అతని కాలుపెట్టుకొని దీపం పట్టుకొని చూసింది. జిడ్డు జిడ్డయిన కాలు మెత్తగా పసిపిల్లవాడి కాలులెక్క తయారయింది.

Scanned by CamScanner

చిన్నగా పుట్టుమచ్చలా ఒకచోట కన్పడ్తుంది. తన మెడల దండకున్న 'సిమ్మెట' తోటి కెలికింది లక్ష్మి. బాధగా మూలిగిండు వీరయ్య. ముల్లు తీసింది. ఉప్పు నమిలి ముల్లు విరిగిన చోట రాసి నిప్పు కొర్రాయితో చురుకు పెట్టింది.

"వీరన్నా! వీరన్నా!" పిలిచిండ్రెవళో?

లక్ష్మి బయటకు పోయి చూసింది.

"ఆఁ మీరా అన్నా?...రాండ్రి! రాండ్రి! తలగమిట్లుండె పిలవ్వడ్తిరి!" అంది.

"అన్నున్నడా?" అనుకుంటూ లక్ష్మి ననుసరించిండ్రు.

"ఉన్నడు, కాలుకు ముల్లిరిగింది నడువత్తలేదు" అంది.

వచ్చిన, ఇద్దరిని చూసి "లాల్ సలామన్నా! ఇప్పుడే అత్తుండ్రా?" అడిగిండు వీరయ్య.

"లాల్ సలామన్నా! గట్టెట్లిరిగిందే" అడిగిండ్రు.

"బురద పనాయే... ఎక్కడేముందో ఎట్లదెలుత్తది, కూసోండ్రి!" అరుగు మీదున్న చెక్క చూపించిండు వీరయ్య.

లక్ష్మి పప్పు రుద్దుతుంది.

పసిపోరి తొట్టెలో నిద్రపోతుంది.

వీరయ్య ఉద్యమ మంచి చెడ్డా కబుర్లలోకి దిగి నిర్మాణపరమైన సాధకబాధకాలు తెల్సుకుంటున్నడు.

నిర్బంధం రీత్యా, భూస్వాములదే పైచేయిగా ఉన్నట్లు, అంచనాకు మించి అతిగా కొందరిని నమ్మటం వల్ల విపరీత నష్టాలకు గురవుతున్నట్టు లీగల్ ఆర్గనైజర్ నారాయణ వివరిస్తున్నడు.

బలీయమైన వ్యవస్థీకృత నమ్మకాల వల్ల, వ్యక్తి వికాస ప్రభావం వల్ల అనుకున్నంతగా శ్రామికుల్ని కూడగట్ట లేకపోతున్నమని కూడా మరో మిత్రుడు రాజనర్సయ్య తెలుపుతున్నడు.

రాజనర్సయ్య ఉద్యమంలో కీలకమైన వ్యక్తి, రచయితా, వక్త. అనేక సాహితి

Scanned by CamScanner

ప్రకియల్లో ప్రవేశముంది. విద్యార్థి,మహిళ,కార్మిక,పల్లె రైతాంగ ఉద్యమ నిర్మాణంలో తగినంత పరిచయమూ సాన్నిహిత్యమూ ఉంది. అధ్యయనమూ అవగాహనే కాకుండా ఉద్యమం కోసం ఉపాధ్యాయ ఉద్యోగాన్నీ కుటుంబాన్ని వదిలేసి వచ్చిన త్యాగశీలత ఉంది.

"ఉద్యమాన్ని విస్తరించడంలో చురుకుదనం పాటించకోతే...మున్ముందు ఎంత మాత్రం శ్రామికుల్ని బలంగా సంఘటితం చేయలేమోమో, మనకు మిత్రవర్గంగా ఉంటుందనుకున్న మధ్యతరగతి కూడా అసందర్భంగానే ఒక అడ్డంకిగా పరిణమిస్తుంది. నిత్యం రేయింబవళ్ళు రెక్కలొంచుకునే కష్టజీవులు కూడా అసంకల్పితంగానే శ్రామికేతరమవుతున్న పరిస్థితి,ఒక్కొక్కప్పుడు ఉద్యమ వ్యతిరేకులు కావడం...ఇదంతా ఏదో విడ్డూరంగా అన్పిస్తూ ఉంటుంది. వివరించే మేధావుల కొరత విపరీతంగనే ఉంది. ఏం చేయటం, ఏదో ఒకటి చెయ్యాలె తప్పదు" అన్నడు వీరయ్య.

ఎవరికి తోచిన అంశాలతో వారు చర్చించుకుంటున్నరు.

"ఈ పరిస్థితిలో నువు మాతో కలిసి పనిచేయాలన్నా!" వచ్చిన పనేదో తొందరగా ముగించుకోవాలనే ఉద్దేశ్యంతోటి టకీల్న అనేసిండు రాజనర్సయ్య.

"అందుకోసమే పార్టీ మమ్మల్ని పంపించింది!" అన్నాడు నారాయణ.

కొంతసేపు అందరూ మౌనంగా కూసున్నరు.

"లక్ష్మితో మాట్లాడి సాధ్యమయినంత తొందరగా ఒక నిర్ణయానికి వచ్చి తెలియజేస్తాను." సాలోచనగా అన్నడు వీరయ్య.

తన భర్తను కలిసి పని జేయమని అడగటానికి పార్టీ పంపించడం, అతను తన మీద బరోసా పెట్టడం, లక్ష్మికి ఆత్మాభిమానంతో ఆనందం కల్గించింది. పసిపోరి లేకపోతే...తనూ...భర్తతో పోయేదే. దొరలూ భూస్వాములూ అప్పుల సేట్లూ జనాలను ఎంత కష్టపెడ్తుందీ, ఎంత కష్టపడ్డా పొట్టకూటికందని బతుకులు లక్ష్మి చూస్తూనే ఉంది. భర్తతో రోజువారీ పనిచేస్తూ తరతరాల తమ కథలు, వివిధ వేషాల్లో ఉన్న దోపిడీ బాగోతాలు వింటూనే ఉంది. అర్థమయీ అర్థం కాకున్నా ఈ పరిస్థితిని భరించటం విసుగ్గా తోస్తుంది.

"నన్నడ్గేడిదేముంది నీకు తోచినట్టు చేయి, నాకేమెర్క? నాకు పసిపోరి ఉండుట్ల గానీ...నేను గూడా నీతోటే అత్తు. ఈ పోరిని బుద్ధిగ్యానం అచ్చేదాక సాదుకుంట, ఈ బతుకుల ఏముంది? నంగి నంగి బతుకుడు, ఏజ్జేసినా మన మనస్సుకు తుర్తి గల్గాలె,

Scanned by CamScanner

ప్రాణమంత ఆడ, ఉత్తశెత్త ఈడ–పార్టేమయితుందో...మనోళ్ళకు ఎంత మందికి ప్రాణాల మీది కత్తుందో, ఇదే గదా నువు రంది పడేది. ఈరయ్య..! పో! మేం బతుకలేమా? కలోగంజి తాగి బతుకుతం, మా కోసమేం ఫికరు లేదు, అన్నలూ...అత్తడు, మా ఈరయ్య అత్తడు...గివ్వన్ని చెప్పన్నా..? నీకెర్క లేదా? మనకు మన్నున బట్టింది ఏంటిదో గదే జెయ్యాలె! ఈ రాజ్జెం పాడుగాను, ఏం బతుకులు, ఏం బతుకులు...” బతికిన బతుకు ఏవగింపుగా చెప్పింది లక్ష్మి.

“లక్ష్మక్కకు ఎంత చైతన్య మందించిండు వీరన్నా”

నారాయణ, రాజనర్సయ్య ఆశ్చర్యపోయింద్రు.

“ముందుగాల బువ్వతిందాం! ఎప్పుడు తిన్నరో...యాడ తిన్నరో..” అంటూ లక్ష్మి లేచింది.

చాపవేసి, పల్లేల్లో వడ్డించి తాను కూకుంది.

అందరూ కల్సి భోజనం ముగించింద్రు.

“మళ్ళీ కలుద్దామన్నా! ఆలోగా....ఏదో ఒకటి చెప్పాలె!” అన్నడు రాజనర్సయ్య.

“ఏదో చెప్పటమేంది, మీ ముందే చెప్పింది గదా లక్ష్మి! మీరు వచ్చేలోగా సిద్ధపడి ఉంటాను.” అన్నడు వీరయ్య.

“మంచిది కలుస్తమన్నా...కలుస్తమన్నా! పోతమ్మరి, లాల్ సలాం!” చెబుతూ వెళ్ళిపోయింద్రు. వాళ్ళు పోతున్న వైపే చాలా సేపు చూసి వీరయ్య ఇంట్లో కొచ్చిండు. తొట్టెలోకి వంగి పడుకున్న రేణను ముద్దిచ్చుకున్నాడు. చిటికలు వేసి లేపి ఎత్తుకున్నాడు.

* * * * * * *

ఆ తర్వాత ఉన్న పొలాన్ని తానే ‘పాలు’ కి దున్నించుకుంటూ రేణను పోషించుకుంటూ చదివించింది. రోజురోజుకు ఉక్కుపాదం బలిసింది. పడగ విప్పి బుసకొట్టింది. ఉద్యమం ఎదురుదెబ్బలు తీసింది. ఎత్తుగడలు వేసింది. పోలీసులు కార్యకర్తల కుటుంబాల్ని ధ్వంసం చేసింద్రు. ఇళ్ళను కూల్చింద్రు, ఎవరు దొర్కితే వారిని చితగ్గొట్టింద్రు. స్త్రీ అనే విచక్షణ లేకుండా లక్ష్మిని కూడా ఎన్నోసార్లు హింసించింద్రు. ఇంటిని కూడా కూలగొట్టింద్రు. దాని జాగలనే ఒక గుడిసె వేసుకుంది. అప్పుడప్పుడు రాత్రిళ్ళు ఇంటికి వచ్చే వీరయ్య తగ్గిపోయింద్రు. ప్రభుత్వ నిఘా పెరిగింది. తెగించినంతగా పోలీస్ ఇన్‌ఫార్మర్లు తెగిపోతున్నరు అన్ని గ్రామాల్లో

Scanned by CamScanner

పోలీసులంటేనే ఒక ఏహ్యత ఏర్పడింది. లక్ష్మి పొలం ఎవరూ దున్నొద్దని బెదిరించిండ్రు. కైకిలు చేస్కుంటూ కాలం వెల్లదీసింది. వీరయ్య అసలు ఇంటికి రావటమే మానుకున్నడు.

"నువ్విక్కడికి రావటం పార్టీకి, నీకూ, నాకు అందరికి నష్టం, పోరి పెద్దగయినంక నీ బిడ్డా నేను ఇద్దరమూ నీతోటే అత్తము" అని లక్ష్మి బుజ్జగించింది. నారాయణ రాజనర్సయ్య లీగల్ నిర్మాణం నుంచి అజ్ఞాతములోకి వెళ్ళిపోయిండ్రు. నారాయణ దళ కమాండరయ్యిండు. రాజనర్సయ్య ప్రావిన్షియల్ కమిటి సభ్యుడయ్యిండు.

ప్రభుత్వం....రహస్యోద్యమ నాయకుల వివరాల్ని ఆరా తీసింది. తలలకు వెలలు ప్రకటిస్తూ లొంగిపోయిన వారికి పునరావాసం కలుగజేస్తూ వారిపై ప్రకటించిన రివార్డు వారికే అందరజేస్తామని ప్రకటించింది.

వార్తల్తో పత్రికలు అతిశయోక్తులు, అద్భుత కథనాల్తో జోరందుకున్నయి. భూస్వాములు పట్టణాలకి పారిపోయి బిక్కు బిక్కుమంటూ తలదాచుకుంటున్నరు. భూములు బీడు పడ్డయి. కరువు ఏర్పడ్డది.

కంప్యూటర్ ముఖ్యమంత్రి, యాడాదికో ప్రధానమంత్రి నక్సలిజం మీద నానా కబుర్లాడుతున్నరు.

కొందరు బలహీనతలున్న మిలిటెంట్లను ఆసరాగా చేస్కుని నమ్మకంగా దెబ్బ కొడ్తున్నరు పోలీసులు. అవగాహనారాహిత్యంతో భావదరిద్రులు వర్గకసిలేని పిరికిపందలు కొందరు ప్రభుత్వ ప్రలోభాలకు తలొగ్గి లొంగిపోతూ హోం మంత్రి పక్కలో అల్ప సంతోషంతో ఇంటర్వ్యూ పోజులు పెడ్తూ పోలీసుల కనుసన్నల్లో ఉద్యమంపై దుమ్మెత్తి పోస్తున్నరు.

లొంగి పోయింతర్వాత కూడా కొందరు బూటకపు ఎన్‌కౌంటర్లకు ఎరవుతూనే ఉన్నారు.

అనుకోని సంఘటనగా ధనజీవన స్రవంతికి లొంగిపోతూ నారాయణ లక్ష రూపాయలు, రాజనర్సయ్య మూడు లక్షల రూపాయల చెక్కును ఆర్భాటంగా హోమ్మంత్రి చేతుల మీదుగా విలేకరుల సమావేశంలో అందుకున్నరు.

తామెందుకు లొంగిపోతున్నారో...ఏవో కారణాలు వివరించిండ్రు.

ఈ పరిస్థితి లక్ష్మికి మరింత వర్గకసిని పెంచింది. గానీ, ఏమాత్రం చేవ తగ్గలేదు.

Scanned by CamScanner

ఒక రోజు వీరయ్య అమరుడైనాడన్న వార్త వెనుకాలే...పోలీసులూ, శవం...ఉద్యమ లీగల్ సానుభూతిపరులూ, జనమూ, ఎర్రజెండాలు, అంతిమయాత్రా, ఆక్రోశం, ప్రవాహంగా జనసందోహం, పోలీసుల చిటపటలూ.

ఎన్నోసార్లు ఖాకీ రాక్షసత్వాన్ని అనుభవించిన లక్ష్మి ఈసారి మాత్రం చాలా రోజులదాకా కోలుకోలేదు.

వీరయ్య వదిలిన జ్ఞాపకాల నీడలో దాచుకున్న పుస్తకాల్ని ఎన్ని ఒంటరి రాత్రుల్ని చదివిందో...పెద్దయ్యాక రేణకి కూడా తన గతమంతా వివరించింది.

చాలా వాస్తవాల్ని విన్పించింది, చదివించింది.

పనిపాటా కబుర్లూ బతుకు అన్నిటి నుంచి నిక్కపొడుచుకుని చూస్తున్న వారి ఆలోచనలు-సమాజ ధిక్కార స్వరాలు సామాజిక సాలోచన వరాలు-జనంతో కలివిడి నైజం, పనులతో ప్రజలతో స్వేదం చిందే సాహచర్యం, రహస్య మిత్రులతో రక్తం చిందే కరచాలనం.

లొంగుబాటుపై ఏవగింపు

వ్యవస్థపై అసహ్యం

పోరాటంపై సంఘీభావోత్తేజం

మేధస్సు జీవన ప్రజ్ఞాపాటవాల్ని నేర్పిన విచిత్ర సంఘర్షణ...అయితే...తిండి కోసం...పనివల్ల...తాననుకున్నంత సైద్ధాంతికావగాహన సాధించలేకనో...అదే పనిగా అందరితో కలిసి తానేమిటో గజిబిజి అవ్వటం వల్లనో కొన్ని నమ్మకాలూ సంప్రదాయాలు ముందుకి పోకుండా వెనక్కి రాకుండా అట్లాగే ఉన్నయి లక్ష్మికి.

ఎండ వేడి తగ్గింది, చెమట తుడ్చుకుంది. జ్ఞాపకాల్ని త్రోసింది. “రేణా! లెవ్వు! లెవ్వు బిడ్డా! సల్లవడ్డది!” లేపింది లక్ష్మి.

రేణ అటీటు చూసి లేచి కూకుంది.

“మొకం మీద నీళ్ళు జల్లుకొని కొన్ని నీళ్ళుదాగు బిడ్డా సల్లగుంటది, నిద్రమజ్జు పోతది” లొట్టి అందిస్తూ అంది లక్ష్మి.

నీళ్ళు చల్లుకుని ముఖం తుడుచుకుంది. గటగటాద నీళ్ళు తాగింది. లక్ష్మికి కూడా వంచింది. మిగిలిన నీళ్ళతో ఇద్దరూ కాళ్ళూ చేతులూ కడుక్కున్నరు.

Scanned by CamScanner

మోపులెత్తుకొని ఇంటికి చేరుకునేసరికి పొద్దుగూకి మసకబారుతుంది.

* * * * * * *

పొద్దున్నే లేచి,పని ముగించుకొని తిని, మోపుల్ని విప్పి రెండు చిన్న మోపులుగా మార్చింగ్రు. ఎత్తుకొని బయల్దేరేప్పుడు ఏడు గంటలవుతుందేమో...ఎల్లారెడ్డిపేట్ బస్టాండ్ కొచ్చేసరికి తొమ్మిదయ్యింది. మోపుల్ని దించి, హోటల్లో చాయ్ తాగింగ్రు. మళ్లీ మోపుల్నెత్తుకొని, ఆ సందీ ఈ సందీ తిరుక్కుంటూ, “కట్టెలు తీస్కుంటారమ్మా!” బతుకు ఇచ్చిన సానునయంతో అడుక్కుంటూ, నడి ఊళ్ళోకి వచ్చి మరో వీధిలోకి మళ్ళింగ్రు.

“ఓ....అమ్మా!...ఇక్కడ రాంగ్రీ!” అన్నమాట వినబడి, వెనకకు మర్రింది. షేవింగ్ చేస్కుంటున్న వ్యక్తి రాజనర్సయ్య సార్!

“నువ్వా!లక్ష్మి! నేనెవరో అన్కుంటున్నా! వీళ్ళెవరు?” అడ్గిండు రాజనర్సయ్య సారు.

తీక్షణంగా చూసింది లక్ష్మి. రాజనర్సయ్య సారే ! అనుమానం లేదు.

“ నా బిడ్డ రేణ!” అంది ముక్తసరిగా లక్ష్మి.

“ఎంతకో ఒగంతకు తీస్కుందాంగని దించుంగ్రి!” అన్నాడు రాజనర్సయ్య.

రెండు మోపుల్ని కింద ఎత్తేసింగ్రు.

గడ్డం తీస్కుని, ముఖం కడుక్కున్నడు రాజనర్సయ్య.

రాజనర్సయ్యను చూడంగనే వచ్చిన కోపాన్ని అటే దిగమింగింది లక్ష్మి.

తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే నవ్వు నవ్విండు. సమర్థించుకునే మాటల్ని వెతుకుతున్నడు. ఉద్యమాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాన్నేదో తానే ఈ మధ్య రంగరిస్తున్నడు.

“అట్లనే నిలబడ్తిరి. కూర్చోంగ్రి!” ఇంట్లోకి పిలిచి బెంచి చూపెట్టిండు.

“నీళ్ళు తాగుతరా? రాధా!...కొన్ని నీళ్ళు తీసుకురా!” అన్నడు.

రాధ నీళ్ళు తెచ్చింది. వీళ్ళెవరన్నట్టు చూసింది. నీళ్ళిచ్చి బయటున్న కట్టెలమోపుల్ని చూసింది. బేరమయిందా? అన్నట్టు సంశయాత్మకంగా ముఖం పెట్టింది. ఇట్లాటి వాళ్ళు మోసం చేస్తరు. మా ఆయనకు బేరం చేయరాదేం లేదు, అన్నట్టు

Scanned by CamScanner

విస్మయాన్ని అతని ముఖంతో జోడించి, బెంచీపై దృష్టి సారించి, ఇక్కడెందుకూర్చున్నట్టో అర్థంకాక, భర్తను అడిగే సాహసం ఆమె సాహవాసంలో లేదు గనుక, మళ్ళీ ఇంట్లోకి పోబోయింది.

"రాధా! నేను అప్పుడప్పుడు వీరన్న అని చెప్తుండేవాన్ని సూడూ! ఆయన భార్య లక్ష్మి. బిడ్డ రేణ". భర్త చెప్పిందే తడవుగా చెంబు పక్కనున్న టేబుల్‌పై పెట్టి, మొహమాటంగానే అలవోకగా చేతులు జోడించి "నా పేరు రాధ" అంది.

లక్ష్మి, రేణ నవ్వుతూ చేతులు జోడించిండ్రు.

"పాపం! పార్టీ వల్ల...వీళ్ళు బాగా నష్టపోయిండ్రు." జాలి కురిపిస్తూ అటువైపు ముఖం తిప్పిండు.

"టీ ఉందా? ఉంటే వేడి చేసియ్యి!" పురమాయించిండు.

"ఏ!...ఎందుకు సార్? ఇప్పుడే బస్టాండ్‌ల తాగచ్చినం!" అంది లక్ష్మి.

"అయిపోయింది!" అంది రాధ

" ఏ పీడితుల విముక్తి కోసం బయల్దేరాయో ఉద్యమాలు, ఆ పీడితుల్నే మరింత పీడితులుగా, ఏ కులహీనుల కోసం పోరాటమన్నరో, ఆ కులహీనులే నీచంగా దిగజారిపోయే వాతావరణం ఈ పార్టీల వల్ల, ఈ ఉద్యమాల వల్ల కల్గిందని మళ్ళొక్క సారి మిమ్మల్ని చూసాక, నా కన్పిస్తుంది! ఏం సాధించుకున్నరు?...ఏం బావుకున్నరు? చూడు!...పిల్ల పెళ్ళికెదిగింది. నీ వయసుడిగింది. కట్టెలెత్తుకొని, ఎవ్వరూ కానని దగ్గరికి పోయి బతుకవలసివచ్చిన దీన స్థితి. మీరు మాత్రం విపరీతంగా నష్టపోయిండ్రు. నాకు చాలా బాధగా ఉంది. అగ్రశ్రేణి నాయకులంతా అగ్రవర్ణాల వారే...సుఖాలూ,పోకడలూ, పోజులూ వాళ్ళవి. కష్టాలు, నష్టాలు మీలాటి వాళ్ళవి!"

సరాయించుకొని నీళ్ళు తాగిండు.

అప్పుడు 'లక్ష్మక్క' అని సంభోదించిన రాజనర్సయ్య ఇప్పుడు "లక్ష్మీ!" అని సంబోధించడాన్ని గమనించింది లక్ష్మి.

" చూడు లక్ష్మీ! నేను పదిహేనేళ్ళు పార్టీ కోసం అజ్ఞాతంలో తిరిగాను–ఉద్యోగాన్ని భార్యాపిల్లల్ని వదులుకొని. ఎవడు గుర్తించాడు? నేనెంత నష్టపోయాను! మాతోటి పోరాటంలోకి వచ్చిన ఎంతమంది రత్నాల్లాంటి యువకులు బుగ్గి పాలయ్యారు. తలచుకుంటే దుఃఖమొస్తుంది. ఈ పోరాటాల వల్ల బతుకును

Scanned by CamScanner

గెల్చుకోవటం నేర్చుకోలేము. ఓడిపోవటాన్నే నేర్చుకుంటాము....చల్లటి చావు కబురులాగా చచ్చినవాడికి అమరుడని పేరెట్టి, దేవున్ని చేసి పాటలుగడ్తే తిరిగొస్తాడా?

"ఏం లాభం?...కుల విముక్తిని తప్పు దోవ పట్టించడానికి ఈ అగ్రవర్ణ నాయకులు అన్నిట్లో వాళ్లే ఉండాలి. చావటం నేర్పేది, దుఃఖాన్ని నేర్పేది, ఓడిపోవటాన్ని నేర్పేది, గబ్బు పేదరికాన్ని భరించే ఓరిమినిచ్చేది...అంటూ ఏదైనా ఉంటే...అదే... మీరిప్పుడు అనుభవిస్తున్న విప్లవ పార్టీ పుణ్యం.

"ఇక చాలించుమని ఎదురు నిలిచి అడగాలి!"

"స్త్రీలకు, దళితులకు ఏ మాత్రం గుర్తింపివ్వని, పీడితుల జీవన విధానాన్ని ఏ మాత్రం మార్చని, ఉద్యమాల్ని తూర్పారబట్టాలి. ఇక మీ వల్ల నష్టాల్ని భరించటం మా వల్ల కాదని చాటి చెప్పాలి. మీ సుఖభోగ, పట్టణ విలాస జీవితాలను కాపాడ్డం కోసం...మా రహస్య అడవులు పట్టుకొనే అజ్ఞాత జీవితమా.ఇక చెల్లదని చాటాలి! ప్రత్యేక స్త్రీ, దళిత ఉద్యమాల్ని నిర్మించుకోవాలి...."

అర్థమయి, అర్థంకాక తెచ్చుకున్న ఓపికతో వినయంగా వింది లక్ష్మి.

రేణ అర్థమయినట్టే...ఏదో నవ్వుకుంది.

గోడకున్న గడియారం పది కొట్టింది.

షెల్పుల్లో అలంకారప్రాయంగా చిన్న చిన్న అందమైన బొమ్మలున్నాయి. తప్పుకొని పారిపోవడానికి వీలు ఉన్న చిన్నచిన్న సందుల్లాంటి పుస్తకాల సందడి ఉంది. రాతపూత కాగితాలు, కలాలు మోసే చిప్ప, కేలండర్లు గట్రా మరీ లావైన సైద్ధాంతిక గ్రంథాలు కూడా ఉన్నాయి. అతడు, అతన్ని గుర్తించిన వారి బొమ్మలతో గుర్తింపు షీల్డులూ సకల సౌఖ్య పరికరాలు ఒద్దికగా ఉన్నాయి. డోర్ కర్టెన్ గాలికి అటూ ఇటూ ఊగుతుంది. ఫ్యాను తిరుగుతుంది. లావెక్కి డిగ్నిటిగా నిలబడ్డ తన కొడుకు ఇంజనీర్ ఫోటో కూడా గర్వంగా "మీరెవరు?" అని అడుగుతూ, డోర్‌వైపు చూస్తున్నట్టుంది.

వంటిట్లోంచి కమ్మటి తాళింపు వస్తోంది.

లక్ష్మికి వాంతిగా ఉంది-రేణకు అసహ్యంగా ఉంది.

"అవ్వా! పోదాం పా!" అంది రేణ.

Scanned by CamScanner

"ఎంతకు తీస్కుంటవో...చెప్పి...పైసలియ్యి. పోతం!" అంది లక్ష్మి.

"లక్ష్మీ! నేనన్నది తప్పుగా అన్పించిందా?" నవ్వుతూ అడిగిండు రాజనర్సయ్య.

అర్భకత్వానికి రేణకు మళ్ళీ నవ్వొచ్చింది. కొంగు నోట్లో పెట్టుకొని అదిమింది.

"ఏం తప్పో సారు...పోతం...ఎంతకు దీస్కుంటవో శెప్పు! గిడ్డే ఇత్తం...లేకపోతే పోతం!" అంది లక్ష్మి.

"కట్టెలు ఇగేడికి దీస్కపోతరుగని, ఇగో...ముప్పయి రూపాయలు, పదిహేను రూపాయల కొక మోపు" అని గూట్లో నుంచి తీసిచ్చిండు పైసలు.

అతనితో బేరమాడ్డం, మాట్లాడ్తూ కూర్చోటం-లక్ష్మికి ఇష్టం అన్పించలేదు. రేణగ్గాడ బుద్ధిదండగ మనిషిగా తోచింది, మాటల పుంజుగా అర్థమయింది.

లక్ష్మి డబ్బులు తీస్కుంది.

"పోతం సారూ!" లేస్తూ అంది లక్ష్మి. రేణ కూడా లేచింది.

"మిమ్ముల జూత్తే నాకు బాధ అన్పిస్తుంది లక్ష్మీ! అట్లా అన్పించే ఇవన్నీ అన్నాను. మీలాంటి మరెన్ని కుటుంబాలు పతనమయినాయో...లెక్కే లేదు" మళ్ళీ దుఃఖంలాంటి జాలి కురిపించిండు.

అణచుకున్న కోపం, ఆపుకున్న ప్రశ్నలు మస్తిష్కం నుండి మరిగి మరిగి లేచినట్లై-

"మమ్ముల జూత్తే మీకేం బాధ సారూ...

"మిమ్ములజూత్తే మాకే బాధ అన్పిత్తుంది. గన్నేండ్లు పార్టీ రహస్య నిర్మాణంల పనిజేసి, ఎంతో ముఖ్యమైన వ్యక్తిగా ఉండి, గింత దరిద్రంగా దిగజారిపోయిండ్రని, దానికివన్నీ సాకులూ, జాలి జూపెడ్తూ బాకాలూ. మాకు మిమ్మల్ని చూస్తే చాలా బాధగా ఉంది సారూ...ఎంత పతనమయిండ్రో?"

ఖంగుతిన్నట్టయ్యింది రాజనర్సయ్యకు. తట్టుకొని లేవ ప్రయత్నిస్తున్నడు.

"మమ్ముల జూస్తే మీకేం బాధ, మాకే బాధ, మాలాటి కోట్ల మందికి బాధ-బాధిత ప్రజానీక విముక్తి ఉద్యమాల్లోంచి పిరికిగా పరుగెట్టుకొచ్చిన మీకేం బాధ." కోపంగా అంది రేణ.

Scanned by CamScanner

"సారూ!...మీకా పోయిన ఉద్యోగం వచ్చింది. సర్కారోళ్ళు లొంగిపోయినందుక్క ఇచ్చేటియి ఇచ్చిరి. ప్రజలను దోపిడి నుంచి కాపాడేతందుకు, యిముక్తి చేసేతందుక్క ఉద్యమం పోరాడుతుంది. దాన్ల ఎవలతెల్విని బట్టి వాళ్ళు పనిజేత్తరు. మేం నష్టపోయిందేంది? ఇంతకు ముందీ నష్టం లేదా? కొంచెం తెల్వితోటి దోపిడి కిటుకులు దెల్సి మేం ఉషారుకొద్ది బతికిపోయిన మనుకో...కోట్లాది మా అసుంటి జనం గట్లనే ఉంటరు గదా? గదే నష్టంలనే ఉంటరు గదా! ఇగ నాయకులు పట్నాలల్ల ఉంటుండ్రంటే....మీ అసంటోళ్ళు అనచ్చా? ఏ సర్కారోడో, ఏ పోలీసోడో, ఏ భూసామో అన్నడంటే అదొగ లెక్క. ఉద్యమ నిర్మాణ అవుసరాన్ని బట్టి ఎక్కడో ఒగక్కడ ఉంటరు. వాళ్ళెక్కడుంటుండ్రనేది- మన సమస్య గాదు, మన పగోల్ల సమస్య. ఇప్పుడు మనగ్గావాల్సింది, ఈ రాజ్జెం ఇట్లనే ఉంది, దీంతోటి కోట్ల మందికి తిప్పల ఉంది, ఇది శాశ్వతంగా పోయి, అందరికీ ఆకలి తీరి సమానం గుండే రాజ్జెంగావాలె. అందుకోసం మనము పోరాడాలె, దేంతోటి...ఈ మోసకారి రాజ్జెం తోటి. అది ఉద్యమాలల్ల ఉండే పోరాడాలె గని, అలగ్ సలాగుండి పోరాటమంటే...అది ఒంటరి తిక్కనేగాని పోరాటం కాదు. ఇగవోతె, మిమ్ముల్ని గుర్తించడం....ఏం పని? పదిహేనేండ్లు చేసినా, ఇరవయేండ్లు జేసినా...సచ్చేదాక చేసినా...ఉద్దేశమేందంటే... ఈ రాజ్జెం పోవాలనే గట్టి పట్టుదలనే. ఇది ఒగోళ్ళకాగోళ్ళు ఎంతజేసింద్రు ఏం జేసింద్రు అని యాదికుంచుకోవాల్సిన సమయం గాదు-రాజ్జాన్ని గుర్తించాలె. గానీ...గట్టిగా ఒక్కోన్ని ముఖాన్నే పట్టుకొని, 'వీడు గట్టి దండోడ్రా! మాంచి తెల్సినోడురా!' అనుకుంట తొడలు సరుసుకొని, పొగడుకునే సమయం గాదు." నిదానంగా అంది లక్ష్మి.

రేణ మాట్లాడాలని ఉత్సాహపడ్తుంది.

తాను చదివిన పుస్తకాలూ, తాను గడిపిన జీవన విధానం, తన ఉద్యమనేస్తాలూ-వాద ప్రతివాదనలకు దిగమంటున్నయి. ఎగతాళిగా, ఆక్రోశంగా, ఆవేదనగా కూడా చూస్తుంది రేణ.

'మేమెందుకు పతనమయినమ్, సార్! పనిజేసుకుని బతుకడం పతనమంటే, కడుపు కోసం కట్టెలు మోసైనా బతుకాలనుకోడం దిగజారడం అనుకుంటే-ఇంతకంటే దారిద్ర్యం మరోటుందా? ఎక్కడి నుండి మీరీ మాటలు నేర్చుకున్నరో...ఆ శ్రామిక ఉద్యమాలకే అవమానం. ఏ పోరాటమైనా సరే ఓటమిని నేర్పదు. గెలుపునే నేర్పుతుంది. గెలుపుకు మార్గాల్ని చూపెడ్తుంది. కేవలం వ్యక్తి సుఖాల కోసం...దాపిడీ వ్యవస్థలో అతికొద్ది మందికుండే అవకాశాల్లోకి జారబడే విధానాన్ని, జీవితాన్ని గెలుచుకోవడమంటరా?" అడిగింది రేణ.

Scanned by CamScanner

"ఒగ ఆశయం కోసం అమరుడయినోన్ని గ్యాపకం చేస్కోవడం- ఒక నమ్మకమైన బాధ్యత కాదా? అయితే ఒగప్పుడు మీరు గూడా అమరుల కోసం పాటలు రాసింగ్రు...చచ్చినోళ్ళను దేవుండ్లని జేసినట్లా? మంచిగ సచ్చింగ్రు ఇంక సావుంగ్రి అని శెప్పి, సేతులు దులుపుకొని,ఒడ్డుకెక్కి గిట్ల కాకిగోల పెట్టుమన్నట్లా?" ప్రశ్నించింది లక్ష్మి.

"అట్ల గాదు..." నోరు మెదపబోయిండు రాజనర్సయ్య.

"ఇటు వినండి సార్!..కుల విముక్తిని తప్పు దోవ పట్టించడమే ఉద్దేశ్యంగా అగ్రవర్ణ నాయకులకే ఉంటే-మీలా హాయిగా ఇంటిపట్టున ఉండే-అదేదో వెలగబెట్టోచ్చుగా!...ప్రాణాలకు తెగించి, ఉద్యమాల్ని నిర్మిస్తూ ప్రభుత్వానికి టార్గెటవుతూ రహస్యంగా తలదాచుకోవడమెందుకు? బుల్లెట్లకు ఎరవడమెందుకు మేమెప్పుడూ బతికే చావుని నేర్చుకుంటున్నం. దుఃఖాన్ని అధిగమించడం నేర్చుకుంటున్నం. అసలు...మీరే..బతికినా..చచ్చినట్టే బతుకుతున్నరు. అవును! ఎవరికీ ఉపయోగపడని బతుకు...చచ్చినా ఒకటే. బతికినా ఒకటే!..ప్రపంచమంతా పరచుకున్న గబ్బు పేదరికాన్ని చూసి,భరించే శక్తి లేక, పోరాడే చేవలేక పక్కదారులు వెతుక్కుని....మీదే గందరగోళ జీవితం...." అంది రేణ.

రాధ వచ్చి, ఎప్పటినుంచో గోడకు ఒరిగి నిలబడ్డది."వీళ్ళతో ఏమ్మాటో..?" ఇదంత తగవు. తతంగంలా తోచి డబ్బులిచ్చి, పంపియ్యక-అన్నట్టు చూస్తుంది.

"పీడితులు,దళితులు,స్త్రీలు, ఉద్యమాల వల్ల నష్టపడ్తరా? కొనసాగుతున్న నికృష్ణ వ్యవస్థ వల్ల నష్టపడ్తరా? ఉద్యమ నాయకుల కోసం, కార్యకర్తల రహస్య జీవితమా? రాక్షస రాజ్య యంత్రాంగం కోసం-ఆత్మ రక్షణ కోసం ఉద్యమం ఆసాంతం రహస్య జీవితమా? ఏంటో చెప్పండి సార్! ఏదో...ఏంతోస్తే అదే చెబితే ఎట్లా సార్?" అంది రేణ.

"వీళ్ళతో మాట్లాడి ఎందుకురా తలనొప్పి కల్గించుకున్నాను. ఏదో బాధతో ఉన్నారని సానుభూతి చూపెడ్తే...ఇంకా ఆ మూసలోంచి బయటకు రానట్టే ఉన్నారు. పైగా....నేను చూసినప్పటికీ, ఇప్పటికీ అదే బాణీలో ముదిరిపోయారే...గానీ తగ్గలేదు, కృంగలేదు."స్వగతంగా అనుకున్నడు రాజనర్సయ్య.

ఓపిక నశించింది రాధకు.

"ఏ...తియ్..నీకు ముచ్చట్లంటే పాణం..ఎవలెట్లా జెడిపోతే..నీకేంది? గా

Scanned by CamScanner

కట్టెలమ్ముకొని బతికెటోళ్ళ తోటి ఏందిదంతా....?" ముఖం అసహ్యంగా చిట్లించింది రాధ.

"ఏయ్! నోర్మూయ్! నీకు తెల్వనియి...ఎప్పుడూ మాట్లాడొద్దని చెప్పిన, ముందు నువు ఇంట్లకు పో!" గద్దించి బెదిరించిండు రాజనర్సయ్య.

స్త్రీల కోసం ప్రత్యేక ఉద్యమాల మాట గుర్తొచ్చి రేణకు నవ్వొచ్చింది.

"పాపం! గామేమంది సారూ?...మేం బోతం!" చేతులు జోడించి లేచింది లక్ష్మి.

చెప్పకుండానే రేణ లేచి, తల్లిని అనుసరించింది.

అంగట్లకోయి కూరగాయలూ, ఇతర సామాన్లు కొనుక్కున్నరు.

రాజనర్సు సార్ మాటలనే గుర్తు చేసుకుంటా, నవ్వుకుంటా మాట్లాడుకుంటూ ఇంటికి చేరుకున్నరు.

కాసేపటికి–

"రేణక్కా! రేణక్కా!" అంటూ ఎవరో ఇద్దరు–

"అఁ!...మీరా బిడ్డా! రాండ్రి! రాండ్రి!....రాండ్రి!

ఇంతకు ముందే అచ్చినమ్, ప్యాట్లకు పోయింటిమి!" అంది లక్ష్మి.

"లాల్ సలామక్కా!" అన్నారిద్దరూ.

"లాల్‌సలాం!" అని అలుముకున్నది రేణ.

"ఏం సంగతి.....చాన్నాళ్ళాయే....విశేషాలేమున్నయి!? ఎదువరాయె అచ్చి?" ప్రశ్న వెనుక ప్రశ్న అడిగింది రేణ.

"మేం పగటీలే వచ్చినం...ఎవరూ లేకపోయేసరికి ఊరి బయట, చెట్టు కింద ముచ్చట్లాడుకుంట కూకున్నం" అంది మరొకామె.

"ఏంది బిడ్డా! అంతా మంచిదేనా?" కడుక్కున్న కాళ్ళూ చేతులూ తుడుచుకుంటా అడ్గింది లక్ష్మి.

Scanned by CamScanner

అంతా మంచిదే అన్నట్టు ప్రేమగా నవ్వింది.

అందరూ మంచంపై కూకొని మాటలల్ల వద్దరు.

"రేణక్కా! అసలు విషయం ఏంటంటే... మిమ్మల్నిద్దర్నీ పార్టీ అజ్ఞాత కార్యక్రమాల్లో పనిచేయాల్సిందిగా తీర్మానించి, మీ అభిప్రాయం కోసం మా ఇద్దరినీ పంపింది" అంది ఒకామె.

"ఒక వేళ అంగీకరిస్తే మీ వెంటే తీసుకురండి! అన్నా" రంటూ ఏదో ఉత్తరం తీసిచ్చింది మరొకామె.

లక్ష్మి సంతోషంగా లెటర్‌వైపే చూస్తోంది. రేణ పరిశీలనగా తనలో తానే చదూతుంది.

వర్షాకాల ప్రారంభవేళ పచ్చనవుతున్న గరిక పచ్చనేలలో లోతునుంచి నాలుగు మానవ వృక్షాలు బలిష్టంగా నించుని, అస్తిత్వం కోసం వాయువులు వీస్తున్నట్టు అయింది అక్కడి వాతావరణం.

"అవ్వా! తొందరగా బువ్వండు! తినిపోదాం!" అంది రేణ.

(ఆకుల శ్రీనివాస్‌కు ప్రేమతో...)

(ప్రజాసాహితి, జూలై 98)

Scanned by CamScanner